ఆంధ్రజ్యోతి



ఆటోమొబైల్ రంగంలో

# సరికొత్త ప్రయోగాలు


పాలిటెక్నిక్ కళాశాలలో ఆటోమొబైల్ విభాగం

'అనంత' పాలిటెక్నిక్ విద్యార్థుల ఉత్సాహం
ప్రోత్సాహం కోసం ఎదురుచూపులు

(ఆన్‌లైన్, అనంతపురం)

దేశంలో అత్యధికంగా డిమాండ్ ఉన్న రంగం ఏదంటే మొదట గుర్తుకువచ్చేది ఆటోమొబైల్ రంగమే. గడచిన 20 సంవత్సరాల కాలంలో ఆటోమొబైల్‌రంగాల్లో సరికొత్త ఒరవడి పుట్టుకొస్తోంది. ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు రావడంతో పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకునే.. ఆటోమొబైల్ ఇంజనీర్ల సహాయంతో కేవలం లక్షరూపాయల కారును టాటా కంపెనీ దేశీయ మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. అంత తక్కువ ధరకు కారును దేశంలోకి విడుదల చేయడానికి 'టాటా' ఎంత పెట్టుబడి పెట్టారో... ఆటోమొబైల్ ఇంజనీర్లు కూడా అంత శ్రమపడ్డారు. అంతస్థాయిలో కాకపోయినా, కొద్దిలో కొద్దిగా అనంతపురం పాలిటెక్నిక్ విద్యార్థులు ఇప్పటినుంచే ప్రయోగాలు చేస్తున్నారు. టా టా లాంటి పెట్టుబడి లేకపోయినా ప్రభుత్వం తమకు కేటాయించిన చిన్నపాటి వసతులతోనే విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. వాడుపడిన సెకెండ్‌హ్యాండిల్ పరికరాలు, అతితక్కువ ధరలు పలికే వస్తువులు, ఇనుమును తీసుకుని వాటిపైనే ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. నగర శివారులో ని పాలిటెక్నిక్ కళాశాలలో ఆటోమొబైల్ రంగం విద్యార్థులు పలు రకాల ప్రయోగాలు చేశారు. అవేవో తెలుసుకుందామా..

## డైనమిక్‌మోడల్ ఎలక్ట్రికల్ సిస్టం



2003-2006 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఈ డైనమిక్‌మోడల్ ఎలక్ట్రికల్ సిస్టంను తయారు చేశారు. 15మంది విద్యార్థులు తమ అధ్యాపకుల సలహాలతో లైటింగ్ సిస్టంను కొత్తరూపునకు తెచ్చారు. దీని వల్ల పలు లాభాలు ఉంటాయి. తక్కువ మన్నికఉన్న బ్యాటరీతో పాటు వెహికల్‌కు ఉపయోగించే పలు పరికరాలకు వీటిని అమర్చి స్టీరింగ్‌కు తగిలిస్తే ఆటోమెటిక్ సిస్టంగా తయారవుతాయి. ఎక్కువ ఫోర్స్‌లైటింగ్‌తో పాటు ఆటోమెటిక్‌గా డిమ్ అండ్ డిప్ పడతాయి.

## హైడ్రాలిక్ క్లచ్ సిస్టం



వాహనాన్ని ఉపయోగించేటప్పుడు ఎక్కువగా మనం ఉపయోగపడేది క్లచ్‌మీదే. ఆ క్లచ్ ఎక్కువగా ఉపయోగించడం వల్ల డీజిల్‌ను వాహనం ఎక్కువగా తాగడంతో పాటు మైలేజ్‌ను తక్కువగా ఇస్తుంటుంది. వీటికిధీటుగా విద్యార్థులు హైడ్రాలిక్ క్లచ్ సిస్టం నమూనాను తయారు చేశారు. అందుకనుగుణంగా ఫ్లైల్‌వీల్స్, క్లచ్‌అసెంబ్లి, మాస్టర్‌సిలిండర్, స్లేవ్‌సిలిండర్, స్టీల్ హోస్, రిలైజ్‌ఫోర్క్, రిలైజ్‌బేరింగ్ తదితర పరికరాలను ఉపయోగించి ఈ సిస్టంను తయారు చేశారు.

## హైటెక్ స్లీపర్ కోచ్ బస్సు



హైటెక్ స్లీపర్ కోచ్ బస్సులో ఉండే సదుపాయాలు అందరికీ తెలిసిందే. అప్పర్‌బెర్త్‌తో పాటు మరో బెర్త్ తయారీ సంబంధిన పలు విషయాలతో కూడిన నమూనాలను పాలిటెక్నిక్ విద్యార్థులు తయారుచేశారు. సిట్టింగ్ సిస్టంలో ఇద్దరితో పాటు అప్పర్‌బెర్త్‌లో మరొకరు పడుకునేందుకు వీలుగా ఈ నమూనాలను తయారు చేశారు.

## సరికొత్త స్టీరింగ్ సిస్టం

ఇప్పుడు ఎక్కువగా ప్రతి వెహికల్‌కు వస్తున్నదే పవర్‌స్టీరింగ్ సిస్టం. పవర్‌స్టీరింగ్ వెహికల్‌కు పెట్టాలంటే చాలావరకు చేతి చమురు వదులుతుంది. అలా కాకుండా విద్యార్థులు అంతేస్థాయిలో ఉండే మరోరకం పవర్‌స్టీరింగ్‌సిస్టంను తయారు చేశారు. ఈ స్టీరింగ్ కింద చిన్నపాటి గ్యాస్‌కిట్‌ను ఉంచడంతో పాటు వీలింగ్ సిస్టం పెట్టారు. ఇది పవర్‌స్టీరింగ్‌తో సమానంగా పనిచేస్తుందని విద్యార్థులు చెబుతున్నారు.



## ఫ్యూయల్ ఇంజక్షన్ సిస్టం

2004-07 పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు డాక్టర్ ఆసీఫ్‌అలీ నేతృత్వంలో ఫ్యూయల్ ఇంజక్షన్ సిస్టం నమూనాను తయారు చేశారు. వా హనాలకు ఉపయోగించే ఆయిల్ కంటే తక్కువ ఆయిల్ వినియోగం చేసుకునేందుకు వీలుగా నమూనాను తయారు చేశారు. దీని ద్వారా వాహనం పాడవకుండా.. కాలుష్య నివారణ సాధ్యమని ప్రయో గాల్లో నిరూపించారు.



### ప్రోత్సాహం కోసం..

తమ ప్రతిభకు అధ్యాపకుల సహాయం.. చొరవే కారణమని విద్యార్థులు చెబుతున్నారు. అయితే వీటిని వినియోగించిన పరికరాలు కూడా సెకెండ్‌హ్యాండిల్, ఎందుకు పనికిరానివి ఉపయోగించామని తెలిపారు. ప్రభుత్వం తమను ప్రోత్సహిస్తూ కొద్దిపాటి నిధులు, పరికరాలను విడుదల చేస్తే మరింత రాణించే అవకాశాలుంటాయని పేర్కొంటున్నారు.

# కృష్ణ.. కృష్ణ.. హరే.. హరే..!



- నేడు కృష్ణాష్టమి
- దేదీప్యమానంగా పలు దేవాలయాలు
- విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతున్న 'ఇస్కాన్'


ఇస్కాన్ దేవాలయం

(ఆన్‌లైన్ కల్చరల్, అనంతపురం)

గతి తప్పిన జగతిని ప్రగతి మార్గాన నడవడానికి భగవద్గీతతో చక్కటి మార్గాన్ని చూపాడు శ్రీకృష్ణుడు. చెరసాలలో జన్మించినా.. నల్లటిరూపుతో కనిపించినా.. ఇవేవీ తిరోగమన మార్గాలు కావని నిరూపించాడు. మానవజాతిలో.. ఆత్మవిశ్వాసాన్ని, ఆధ్యాత్మిక భావ సంపదను నింపి జగద్గురువుగా భాసిల్లాడు. అందుకే 'కృష్ణం వందే జగద్గురుం' అని స్మరించని క్షణమంటూ భారతీయులకు ఉండదంటే అతిశయోక్తి కాదు. దశావతారాల్లో సంపూర్ణ స్వరూపాలు రెండే. ఒకటి ధర్మానికి ప్రతి రూపమైన రామావతారం. రెండోది తన దైన వ్యక్తిత్వంతో ఆబాలగోపాలాన్ని అలరించిన కృష్ణావతారం. కృష్ణుడు అవతరించిన రోజే కృష్ణాష్టమి. ఆరోజు పగలంతా ఉపవాసముంటారు. రాత్రికి చిన్నికృష్ణుడిని భక్తిశ్రద్ధలతో పూజించి ఆయనకు ఇష్టమైన పాలు, పెరుగు, వెన్న, అటుకులు నైవేద్యంగా పెడతారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పండుగ అత్యంత కోలాహలంగా జరుగుతుంది. నగరంలో అత్యంత సుందరంగా నిర్మించిన ఇస్కాన్ కృష్ణ మందిరంలో వేడుకలు కన్నులపండువగా జరగనున్నాయి. ఇప్పటికే పలు దేవాలయాలు దేదీప్యమానంగా ముస్తాబయ్యాయి. కృష్ణాష్టమిపై పలువురి అభిప్రాయాలిలా..

## ధర్మసంస్థాపన కోసం ఉద్భవించాడు

ధర్మానికి మాని కల్గిననాడు యుగయుగాన అవతరిస్తానని గీతాచార్యుడు చెప్పుకున్నాడు. ధర్మసంస్థాపన కోసమే మానవరూపంలో ఉండి పురాణ పురుషుడిగా దేవాదిదేవునిగా కీర్తికెక్కాడు. కృష్ణుడిని మాత్రమే భగవంతుడిగా కీర్తించడానికి అధికారముంది. సాక్షాత్తు యోగపురుషులైన రాఘవేంద్రులు, శంకరాచార్యులే తాము గురువులుగా మాత్రమే చెప్పుకుంటే, నేడు సామాన్యులు సైతం కొన్ని బాహ్యచేష్టలతో భగవాన్ అని పిలిపించుకోవడం సనాతన ధర్మానికి విరు ద్ధం. శాంతిని పొందాలంటే భగవంతుడి అంతరంగం తెలుసుకొని మానుకుంటే ప్రశాంత జీవనం పొందుతారు. సాధారణ మనుషులు భగవంతుడితో సమానమన్న మూఢత్వం నుంచి బయటపడాలి. అప్పుడే మన ధర్మానికి రక్షణ లభిస్తుంది.



– దామోదర్ గౌరంగదాస్, ఇస్కాన్ మందిరం

## కృష్ణానుగ్రహం కోసం పరితపించాలి



శ్రీకృష్ణ చైతన్యాన్ని అనుసరించే వారికి కృష్ణానుగ్రహం కలుగుతుంది. భౌతిక సంపదలు, సౌఖ్యాలు అడగకుండానే లభిస్తాయి. దేవుని వద్ద కూడా బేరసారాలు మంచివి కావు. తన సేవలో నిమగ్నులైన వారి అవసరాలను తానే తీరుస్తానని సాక్షాత్తు భగవంతుడే సెలవిచ్చాడు. అందుకే ఆయన అనుగ్రహం కోసం శ్రీకృష్ణుడు చూపిన బాటలో నడిచి తరించాలి. కేవలం పండుగనాడే కాకుండా సదా కృష్ణనామ సంకీర్తనలలో జీవితం పావనం చేసుకుందాం.

– పురోహితులు, గీతామందిరం

## ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి



ప్రామాణికమైన ఆధ్యాత్మిక శాస్త్రాన్ని అనుసరించాలి. అప్పుడే ఆందోళనల నుంచి విముక్తులమవుతాం. నిరంతర ఆనందమయ జీవితాన్ని గడుపుతాం. సనాతన ధర్మం, ఆధ్యాత్మిక భావాలను పెంపొందించే విధంగా అందరి ప్రవర్తన ఉండాలి. సర్వసృష్టికి స్థితి కారకుడైన శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడ, సర్వవ్యాపి. జన్మాష్టమి నాడు ఆయన అనుగ్రహం పొందేలా ప్రవర్తిద్దాం.

–సురేంద్ర, ప్రధాన అర్చకులు, ఉడిపి మఠం

## ఆనందంగా జరుపుకుంటాం



శ్రీకృష్ణుడికి సంబంధించిన కథలు వింటుంటే మనసు పులకించిపోతుంది. ఆయన రూపమే ఆధ్యాత్మిక భావాలను స్ఫురించే సౌందర్య రూపం. ఆయన బాల్యవిశేషాలను కీర్తిస్తూ వచ్చిన అనేక సంకీర్తనలను నృత్యరూపకంలో ప్రదర్శిస్తాం. గోపికలను బాలకృష్ణుడు ఆటపట్టించే ఘట్టంలో మా హావభావ ప్రదర్శనను ఎంతోమంది అభినందించారు. కృష్ణ జన్మాష్టమి మా జీవితంలో మధుర ఘట్టం.

–ఎస్.శీరీష, నృత్యకళాకారిణి

## జన్మాష్టమి చాలా ఇష్టమైన పండుగ



చాలామందికి పండుగలు మధుర జ్ఞాపకాలను అందిస్తాయి. అలాగే నాకు శ్రీకృష్ణ జన్మాష్టమి అంటే చాలా ఇష్టం. ఆ రోజు మా ఇంట్లో, పాఠశాలలో తెలుగు టీచర్ కృష్ణుడికి సంబంధించిన చక్కని కథలు చెబుతారు. నా స్నేహితురాలు భవ్య ఇంట్లో చిన్నికృష్ణుడి పాదముద్రలతో ఇల్లంతా నడిపిస్తారు. వెన్నపూసిన ఆ ముద్రలు ముచ్చటగా ఉంటాయి. మొత్తమ్మీద ఆ రోజంతా ఆనందంగా గడిపేందుకు మా స్నేహితులంతా బాగా సహకరిస్తారు.

–పరిమళరెడ్డి, విద్యార్థిని, క్రీసెంట్ స్కూలు

## వేషధారణ చాలా బాగుంటుంది



మా అమ్మవాళ్ళది గ్రామీణ ప్రాంతం. అమ్మకు దైవ భక్తి చాలా ఎక్కువ. అక్కడ కృష్ణాష్టమి నాడు చిన్న పిల్లలందరితో బాలకృష్ణుల వేషం వేయించి వీధుల్లో కోలాహలంగా భజనలు.. కోలాటంతో తి రుగుతూ ఉంటే చూడటానికి మనోహరంగా ఉం టుంది. బాలవికాస్ కార్యక్రమాల్లో నా తమ్ముడి చే త కృష్ణుని వేషం వేయించి, నాట్యం చేసిన జ్ఞాపకం తలచుకుంటే హాయిగా ఉంటుంది. పండుగనాడు రాత్రి మేము వెన్నెలలో స్వామికి నైవేద్యంగా పెట్టిన ప్రసాదం అందరితో కలిసి సరదాగా తింటాం.

– అమరావతి స్రవంతి, చైతన్యకాలేజీ

## సహజసిద్ధమైన సౌందర్యాన్ని కాపాడుకోవాలి



మేం చాలా సంవత్సరాల నుంచి వందలాది మంది బాలబాలికలతో కృష్ణమేళా కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహిస్తున్నాం. గోకులం పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ రూపాల్లో ముద్దులొలికే బాలకృష్ణ రూపాలను ఏకకాలంలో సందర్శించే అవకాశం కల్పిస్తున్నాం. ఈ పండగకు నెలరోజుల ముందునుంచే పింఛాలు, కిరీటాలు తయారు చేసి ఇవ్వడమే కాక, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జ్ఞాపికలనిస్తాం.

–ఎన్.హరికృష్ణ, కృష్ణమేళా నిర్వాహకులు

## సుందర స్వప్న సాకారం

# ఇస్కాన్

(ఆన్‌లైన్ కల్చరల్, అనంతపురం)

భువిపై వెలిసిన భూతల స్వర్గంగా భాసిల్లుతున్న ఇస్కాన్ మందిరం సామాన్యుని సుందర స్వప్న సాకారంగా చెప్పుకోవచ్చు. కలలో మాత్రమే చూడగలిగిన అపురూప కట్టడం నగరంలో నిర్మితం కావడం జిల్లా వాసుల అదృష్టం. సనాతన ధర్మానికి ప్రతి రూపంగా నిలిచిన ఈ మనోహర శిల్పరాజం జిల్లాకే తలమానికంగా నిలుస్తూ అందరినీ విశేషంగా ఆకర్షిస్తోంది. మందిర ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే మనసు ఆనంద డోలికల్లో ఊగిసలాడుతుంది. ఆధ్యాత్మిక భావాలు వెదజల్లే శ్రీరాధా పార్థసారథుల మనోహర విగ్రహాలు జీవకళ ఉట్టిపడుతూ వింతశోభతో చూపరులను అలరిస్తోంది. పురాణ ఇతిహాసాలలోని మధుర ఘట్టాలు మందిరం చుట్టూ అందంగా నిర్మించిన పాలరాతి విగ్రహాలు కనువిందు చేస్తాయి. మందిరానికి ముందు భాగంలో సుమారు 60 అడుగుల ఎత్తులో నిర్మించిన నాలుగు అశ్వాలు, రథంలా నిర్మితమైన సుందర మందిరాన్ని లాగుతున్నట్టు ఫర్లాంగుదూరం నుంచి చూసినా ప్రేక్షకులకు అనుభూతిని కలిగిస్తోంది. సనాతన ధర్మాన్ని హైందవ మత సంస్కృతి సౌరభావాలను వెదజల్లుతూ కలియుగ వైకుంఠంగా ఇస్కాన్‌లో ప్రధానంగా అన్ని పండుగలు వైభవంగా జరుగుతుంటాయి. ముఖ్యంగా గీతాచార్యుడైన శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకలకు మందిరం శోభాయమానంగా విద్యుద్దీపకాంతులు వెదజల్లుతూ అందంగా ముస్తాబైంది.


రాధాపార్థసారథులు

### మూడురోజుల పాటు వేడుకలు..

శ్రీకృష్ణాష్టమి వేడుకలను మూడురోజుల పాటు ఘ నంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ దామోదర్ ప్రభుదాస్ తెలిపారు. బుధవారం ఉదయం 4.30గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. విశ్వశాంతి మహాయజ్ఞం, ఉట్టిఉత్సవం, రాత్రి ఊంజలసేవ నిర్వహిస్తారు. 2న ఉదయం విశ్వశాంతి మహాయజ్ఞం, సాయంత్రం చిన్నారులు చిత్రవేషధారణ, బహుమతి ప్రదానం, రాత్రి రాధాకృష్ణుల మహాకుంభాభిషేకం నిర్వహిస్తారు. 3న శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుపాదుల విశేషస్మరణ, మహాకుంభాభిషేకం, సాయంత్రం నగర సంకీర్తన నిర్వహిస్తారు. వాటితోపాటు ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

### ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నాం

శ్రీకృష్ణ జయంతి వేడుకలను తిలకించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నాం. హౌసింగ్ బోర్డు, రామ్‌నగర్, 1, 2, 3వరోడ్డు, ఇంజనీరింగ్ కాలేజ్, పాతూరు నుంచి నాలుగు బస్సులు బయలుదేరుతాయి. బస్సులు నగరంలోని అన్ని ప్రధాన కూడళ్ళ నుంచి ప్రతి 2 గంటలకు ఒకసారి బయలుదేరుతాయి. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నాం.

–దామోదర్ ప్రభుదాస్, ఇస్కాన్ మేనేజర్


శ్రీల ప్రభుపాదులు